ప్రమాణ స్వీకారోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, బిజ్జు శత్రు

ముషీరాబాద్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా ఆదివారం మహేష్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి బిజ్జు శత్రు విజ్ఞప్తి చేశారు. శనివారం ముషీరాబాద్‌లో టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకార ప్రచార పోస్టర్‌ను ఆయనతో బిజ్జి శత్రు ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టీపీసీసీ చీఫ్‌కు లీగల్‌సెల్ శుభాకాంక్షలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్‌గా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ లీగల్‌సెల్ నేతలు అభినందించారు. శనివారం టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, కన్వీనర్‌లు దోనేటి భానుచందర్, దినేష్‌చక్రవర్తి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాపూజీనగర్‌లో కూలిన భారీ వృక్షం

ముషీరాబాద్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లోని ఉప్పలమ్మ దేవాలయం సమీపంలో రాములమ్మ ఇంటి వద్ద గల భారీ వృక్షం శనివారం రాత్రి కూలింది. రేకుల ఇంటిపై పడడంతో రేకులు పగిలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కంచికుమార్ ముదిరాజ్ జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో యంత్రాలతో విరిగిన చెట్టును తొలగించారు.

వర్గీకరణ కోసం మంత్రుల కమిటీ అప్రజాస్వామికం

నల్లకుంట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏకపక్షంగా నియమించిన మంత్రుల కమిటీ అప్రజాస్వామికం అని వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కన్వీనర్లు మన్నె శ్రీధర్‌రావు, పి.బల్వంత్‌రావు ఆరోపించారు. ఈ మంత్రుల కమిటీలో మాలలకు స్థానం కల్పించలేదని, దీంతో వెంటనే ఈ కమిటీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ మంత్రుల కమిటీలోని సభ్యులు ఎస్సీల ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి అవకాశాలపై ఎంత వరకు అధ్యయనం చేశారని వారు ప్రశ్నించారు. ఎస్సీల స్థితిగతులపై జ్యూడిషల్ రిటైర్డ్ న్యాయమూర్తుల కమిటీ ఏర్పాటు చేస్తేనే పారదర్శకంగా ఉంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో-కన్వీనర్లు తాలుకా రాజేష్, గోకుల కల్యాణ్, అంజలి, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మంత్రుల కమిటీని వెంటనే రద్దు చేయాలి : డీబీపీ

కవాడిగూడ , సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీని వెంటనే రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ(డీబీపీ) నేతలు డిమాండ్ చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్, నేతలు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, సమితిరాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, మాలమహానాడు జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు సీహెచ్.రోజాలీలా, నాయులు తదితరులు పాల్గొన్నారు.

సేవాకార్యక్రమాల్లో యువత పాల్గొనాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో యువత పాలుపంచుకోవాలని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ పీఆర్‌వో జీకే.రమణ పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలో ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రారంభించిన రమణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు మానసిక సంతృప్తిని అందిసాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



హైదరాబాద్ జిల్లా కబడ్డీ అండర్ 19 బాలుర టైటిల్‌ను కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు కైవసం చేసుకుంది. ఈ జట్టును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చిరంజీవి, అధ్యాపకులు గీతాబాయి, రామ్మోహన్, అనిల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య అభినందించారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

షోయబుల్లాఖాన్‌కు నివాళి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాచరికానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరిగిన యుద్ధమే తెలంగాణ సాయుధ పోరాటం అని సామాజిక ఉద్యమ నాయకులు కృష్ణప్రసాద్ అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి ఆధ్వర్యంలో కాచిగూడ లింగంపల్లి చౌరస్తా వద్ద రజాకార్లు హత్య చేసిన షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, చందు నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, కొమరెల్లి బాబు, లెనిన్, ఆశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల హామీ ఆవిరి

● నత్తనడకన బాకారం గ్రంథాలయ భవన పనులు ● నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం

ప్రజాప్రతినిధుల ఆరేళ్ల హామీ ఆవిరైంది. గ్రంథాలయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రాంనగర్ డివిజన్‌లోని బాకారం గ్రంథాలయ నూతన భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. 60 శాతం నిధులు ఖర్చైనా.. ఏడాది కాలం పూర్తయినా.. ఇంకా స్లాబులు, గోడలే దర్శనమిస్తున్నాయి.



బాకారంలో అసంపూర్తి నిర్మాణంతో ఉన్న గ్రంథాలయ భవనం

రాంనగర్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాకారం గ్రంథాలయ భవన నిర్మాణానికి గ్రంథాలయశాఖ రూ.84 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో 100 గజాల స్థలంలో జీప్లస్ వన్ భవనాన్ని నిర్మించేందుకు గత అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, డిప్యూటీమేయర్ మోతె శ్రీలతారెడ్డి, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి శంకుస్థాపన చేశారు. సంవత్సర కాలం దాటినా ఇంతవరకు గ్రంథాలయ భవన నిర్మాణం 50శాతం కూడా పూర్తికాలేదు. ఇప్పటివరకు స్లాబులు వేయడం, గోడలు కట్టడం మాత్రమే జరిగింది. శంకుస్థాపన జరిగిన ఆరు నెలల్లోనే ఈ గ్రంథాలయ భవనాన్ని ప్రజాఉపయోగంలోకి తీసుకువస్తామని ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ శాఖల అధికారులు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ భవన నిర్మాణానికి 60 శాతానికి పైగా నిధులు విడుదల అయినా కాంట్రాక్టర్ 50 శాతం పనులను కూడా పూర్తి చేయలేదని బాకారం బస్తీ వాసులు, గ్రంథాలయ పాఠకులు వాపోయారు. ఇప్పటికైనా ఈ గ్రంథాలయ నిర్మాణాన్ని వేగవంతం చేసి ప్రజాఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రికార్డుల్లోనే ప్రత్యామ్నాయ గ్రంథాలయం

బాకారం గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం నేపథ్యంలో స్థానిక పాఠకుల కోసం ప్రత్యామ్నాయంగా ఓ భవనంలో తాత్కాలికంగా గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ అధికారులు నేటికీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయలేదు. అయితే అధికారులు మాత్రం ప్రత్యామ్నాయంగా ఓ గదిలో గ్రంథాలయం కొనసాగిస్తున్నామని, అక్కడ దినపత్రికలు, వారపత్రికలు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని తమ రికార్డుల్లో చూపడం గమనార్హం.

నిర్మాణంలో నాణ్యత లోపం

గ్రంథాలయ భవననిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ నాణ్యతాప్రమాణాలను పాటించడం లేదు. సిమెంట్, ఇసుక, కంకర సమపాళ్లలో కలపకుండా చేతివాటం ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిల్లర్లు, స్లాబ్, గోడలకు సరైన వాటర్ క్యూరింగ్ చేయడంలేదని దీని వల్ల నిర్మాణంలో పటిష్టత అంతగా లేదని బస్తీవాసులు పేర్కొన్నారు. సంబంధిత గ్రంథాలయ శాఖ, సంబంధిత ఇంజనీరింగ్ భవన అధికారులు భవన నిర్మాణ ప్రమాణాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. తొలుతగా ఈ భవన నిర్మాణానికి 18 పిల్లర్లు ఏర్పాటు చేస్తామని చెప్పిన కాంట్రాక్టర్ 12 పిల్లర్లతో భవనం నిర్మించడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి



గ్రంథాలయాన్ని త్వరితగతిన ప్రజా ఉపయోగంలోకి తీసుకురావాలి. బాకారం గ్రంథాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. గత సంవత్సర కాలంగా గ్రంథాలయం లేకపోవడంతో స్థానిక ప్రజలకు దినపత్రికలు, వారపత్రికలు అందుబాటులో లేకుండా పోయాయి.

- స్థానికుడు ఎం.సురేష్‌కుమార్

అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కుతోనే జాప్యం



గ్రంథాలయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే గ్రంథాలయ భవన నిర్మాణంలో తీవ్రజాప్యం జరుగుతోంది. సంవత్సరం గడిచినా ఎందుకు పూర్తిచేయడం లేదని సంబంధిత గ్రంథాలయ శాఖ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగినా నిధులు విడుదల కాలేదంటూ సమాధానం చెబుతున్నారు. ఇప్పటికే 60శాతానికి పైగా నిధులు విడుదలైనా ఇప్పటివరకు కేవలం స్లాబులు, గోడలు మాత్రమే కట్టారు. కాంట్రాక్టర్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పనులు వేగవంతం చేయాలి. ప్రత్యామ్నాయ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయకుండానే చేసినట్లు రికార్డులలో చూపడం దారుణం. దినపత్రికలు ఎక్కడకు వెళుతున్నాయి. అద్దె భవనం ఎక్కడ ఉందో అధికారులు చూపాలి.

- కె.రవిచారి, రాంనగర్ కార్పొరేటర్

చర్యలు తీసుకుంటాం



బాకారం గ్రంథాలయ భవనం నిర్మాణానికి సంబంధించిన రెండో విడత నిధులను కాంట్రాక్టర్‌కు విడుదల చేయడం జరిగింది. పనుల్లో జాప్యం జరగకుండా త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. తాత్కాలిక గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగింది. అది ఎందుకు కొనసాగడంలేదో శాఖాపరమైన విచారణ చేపడతాం.

- నగర గ్రంథాలయ కార్యదర్శి పద్మజ

ఎన్టీఆర్ స్టేడియంలో ఆకట్టుకుంటున్న సిల్క్ ఎక్స్‌పో



ఎన్టీఆర్ స్టేడియంలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

కవాడిగూడ, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాల్లో ఉన్న చేనేత కార్మికులు, వృత్తిదారులను ఆదుకోవడానికి నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన శ్రీసాయి చేనేత కాటన్, అండ్ సిల్క్ ఎక్స్‌పోకు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మొత్తం 100 స్టాళ్లకుపైగా ఏర్పాటు చేశారని నిర్వాహకురాలు పద్మజ తెలిపారు. జంటనగరాల ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్వాక్రా మహిళలు, హస్త కళాకారులు ఆర్థికంగా ఎదిగేందుకు తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు ఎక్స్‌పో అందుబాటులో ఉంటుందన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రఘునాథ్‌పాలెం కరికగూడెం ఆడవులలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ గుంటి రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సురేష్, నగర అధ్యక్షుడు పి.ఎం.రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలను తెలుసుకుని ప్రజలకు తెలియజేయడానికి సంఘటన స్థలానికి వెళ్తున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, కార్యదర్శి నారాయణరావు, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలన్న, హైదరాబాద్ సభ్యులు సుదర్శన్, వెంకటేష్, బాలకృష్ణ తదితరులను ఖమ్మం జిల్లా పోలీసులు మణుగురు బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి అశ్వరావుపేట పీఎస్‌కు తరలించారని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారని ఈ వాస్తవాలను నిజనిర్ధారణ కమిటీ బయటపెడుతుందనే పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.



తనికెళ్ల భరణికి పురస్కారం బహూకరిస్తున్న జస్టిస్ రాధారాణి

ఎంత ఉన్నతికి ఎదిగినా సంస్కారం ముఖ్యం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నతస్థాయికి ఎదగడమే ముఖ్యం కాదని ఎంత సంస్కారవంతంగా వారు ఉన్నారన్న దానిపై వారికి సమాజంలో గుర్తింపు ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ వార్షిక వేడుకలలో భాగంగా ప్రముఖ నటుడు తనికెళ్ల భరణికి అక్కినేని భానుమతి పేరిట వంశీ పురస్కారం ప్రదానసభ శనివారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ రాధారాణి హాజరై పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా వంశీ కథలు సంపుటి ఆవిష్కరించారు. సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన సభలో వంశీ రామరాజు సంపుటిని ఉగాండాలో నివాసం ఉంటున్న డా.బి.వ్యాసకృష్ణ, రాధకు అంకితం ఇచ్చారు. దర్శకుడు రేలంగి నరసింహారావు వికలాంగ సంస్థ జాతీయ నాయకుడు కె.నాగేశ్వరరావు, సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొనగా వంశీరామరాజు స్వాగతం పలికారు.

'హెబ్రోన్ చర్చి' ఐక్యతను ఓర్చుకోవడం లేదు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్ చర్చి నిర్వహణలో అందరం కలిసి పనిచేద్దామని దైవసేవకులు, పెద్దలు, విశ్వాసులు అందరూ నిర్ణయం తీసుకుని ముందుకు పోతున్నామని చర్చి నిర్వాహకులు వివరించారు. శనివారం మధ్యాహ్నం గోల్కొండచౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాన్‌సుబ్బారెడ్డి, జోసెఫ్ పి.కురియన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, శామ్యూల్ జకరయ్యా, పీటర్‌రాయ్, టి.ఏసుపాదం, రూబిన్ ఫ్రాన్సిస్, జోసెఫ్ తదితరులు మాట్లాడారు. పోలీసులకు డబ్బులిచ్చి చర్చిని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నామని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవంలేదని వారు తెలిపారు. సమావేశంలో ఎంఎఫ్ పీటర్, కె.అశోక్‌కుమార్, డేవిడ్ మల్లాపూర్, దేవానంద్, అబ్రహామ్, సైదులు పాల్గొన్నారు.

వాస్తవాలను తేల్చాలి

గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో జరుగుతున్న వాస్తవాలను బట్టబయలు చేయాలని క్రైస్తవ ధర్మప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుషలేము మత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కొందరు ప్రముఖులు చర్చి కార్యకలాపాల్లోకి ప్రవేశించి అలజడి సృష్టిస్తున్నారన్నారు. అసలు చర్చిలో వాస్తవాలను తెలియజేయాలన్నారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి

రాంనగర్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి చేసిన సేవలు మరువలేనివని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కొనియాడారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని దివ్యాంగుల సంఘం కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వల్లభనేని ప్రసాద్ దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి : బీఎంపీ

రాంనగర్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలను నిషేధించి బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని బహుజన ముక్తి పార్టీ(బీఎంపీ) జాతీయ అధ్యక్షుడు ప్రవేంద్ర ప్రతాప్‌సింగ్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బీఎంపీ రాష్ట్ర ద్వితీయ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం కోసం ఐక్యం కావాలన్నారు. ఈవీఎంల ద్వారా జరిగే ఎన్నికల్లో అవకతవకలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల రాజకీయ పార్టీ ఏర్పాటుచేసి బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం జరగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు దాస్‌రామ్ నాయక్, వీజీఆర్ నారగోని, ముక్తి మహ్మద్ ఫసీయుద్దీన్, చామకూర రాజు, దాసు సురేష్, పి. ప్రభాకర్, ధర్మయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

కూన వెంకటేష్‌గౌడ్ మృతి పట్ల టీడీపీ సంతాపం

రాంనగర్, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు కూన వెంకటేష్‌గౌడ్ మృతి పట్ల ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పి.సాయిబాబా, నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర నాయకులు నాగు నగేష్, ఎస్.ప్రకాష్ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

కాచిగూడలో మహిళ అదృశ్యం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలో పుస్తకాలు విక్రయించే మహిళ అదృశ్యమైంది. కాచిగూడ సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... హీరాలాల్ తన భార్యా తారాదేవి(55)తో కలిసి కాచిగూడలోని ఓ హోటల్‌లో ఉంటూ పుస్తకాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం పుస్తకాలు విక్రయించడానికి వెళ్లిన తారాదేవి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తారాదేవి బంధువు శనివారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణనాథుడికి ఘన పూజలు



బాగ్‌లింగంపల్లిలో జైగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని గణపతికి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో వైభవంగా సాగుతున్నాయి. శనివారం గోల్నాక, చిక్కడపల్లి, రాంనగర్, అంబర్‌పేట, నల్లకుంట, బర్కత్‌పుర, కాచిగూడ, గాంధీనగర్, కవాడిగూడ , ముషీరాబాద్ ప్రాంతాల్లోని మండపాల్లో కొలువైన గణనాథులకు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పూజలు చేశారు.

- చిక్కడపల్లి/ గోల్నాక/బర్కత్‌పుర/ నల్లకుంట/కవాడిగూడ/ముషీరాబాద్/ రాంనగర్/ సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి)



బాగ్‌లింగంపల్లిలోని గణపతి పూజల్లో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



రాంనగర్‌లో శ్రీగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి పూజల్లో పాల్గొన్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



కవాడిగూడలో అన్నదానం చేస్తున్న నాయకులు



బర్కత్‌పుర హౌసింగ్ బోర్డుపార్కులో అన్నదానంలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ఆధ్వర్యంలోని గణపతి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్, బొట్టు శ్రీనివాస్ తదితరులు

- అభయాంజనేయస్వామి ఆలయంలో గణపతికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పూజలు చేశారు.
- గణేశ్‌నగర్‌లో గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు నర్సింగ్ ముదిరాజ్ తదితరులు పూజలు చేశారు.
- అచ్యుత్‌రెడ్డిమార్గ్‌లో గణపతికి బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్, అశోక్‌కుమార్ పూజలు చేశారు.
- ముషీరాబాద్‌లో అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నేత గౌరీశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి ప్రారంభించారు.
- బాపూజీనగర్‌లో విఘ్నేశ్వరుడికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుశాల్‌గౌడ్ తదితరులు పూజలు చేశారు.
- ముషీరాబాద్ చౌరస్తాలో శక్తియూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని గణనాథుడికి ముషీరాబాద్ ఈఐ రాంబాబు తదితరులు పూజలు చేశారు.
- బోలక్‌పూర్ రంగానగర్‌లో గణనాథుడికి బీఆర్ఎస్ నగర నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముప్పిడి నర్సింగ్‌రావు పూజలు చేశారు.
- గోల్నాక డివిజన్ గంగానగర్‌లోని గణేశ్ మండపాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, మోర శ్రీరాములు ముదిరాజ్ సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు.
- గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లోని గణేష్ మండపంలోని గణనాధనికి బాగ్అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.
- తిలక్‌నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ తదితరులు పూజలు చేశారు. నల్లకుంటలో గణనాథుడికి కార్పొరేటర్ యాకర అమృత తదితరులు పూజలు చేశారు.
- నర్సింహాబస్తీలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి బీజేపీ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ తదితరులు పూజలు చేశారు.
- కాచిగూడ చప్పల్‌బజార్‌లో క్వాలిటీ గార్డెన్ అపార్ట్‌మెంట్ వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడికి కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్ పూజలు చేశారు.
- జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, భాగ్యనగర్‌గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ వినయ్ పూజలు చేశారు.
- కవాడిగూడ బండమైసమ్మనగర్‌లో కొలువుదీరిన వినాయకుడికి తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి మల్లయ్య సుధాకర్ గంగపుత్ర, భక్తులు పూజలు నిర్వహించారు.
- కవాడిగూడ గోల్డెన్‌స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడికి ఎండీ అయూబ్, నిర్వాహకులు గోవింద్, రమేష్, కృష్ణ, రామ్ పూజలు చేశారు.
- దోమలగూడ తాళ్లబస్తీలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద నిర్వాహకులు టి.రవీందర్, సీహెచ్ శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజ్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ అన్నదానం చేశారు.
- జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ వద్ద ఉన్న వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీ లక్ష్మణ్, కాంగ్రెస్ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి జగదీశ్‌బాబు తదితరులు ప్రారంభించారు.
- ఆర్టీసీక్రాస్‌రోడ్ శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో జరుగుతున్న వినాయకచవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి మహాలింగార్చన పూజాకార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.
- డీడీకాలనీలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల వద్ద మిరియాల రమేష్ ఏర్పాటు చేసిన గణపతి పూజా కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.